# విద్యాశాఖకు అవినీతి చెదలు

- ములుగులో డీఈవో లంచం తీసుకుంటూ పట్టుబడడమే నిదర్శనం
- నెగ్గిన ఉపాధ్యాయ సంఘాల పంతం
- పూర్తిస్థాయి విచారణ చేస్తే వెలుగులోకి మరిన్ని నిజాలు
- పరీక్షల నిర్వహణలో అక్రమాలు
- ఉద్యోగ బదిలీలు, నియామకాల్లో చేతివాటం

ములుగు జిల్లాలో విద్యాశాఖకు అవినీతి చెదలు పట్టింది. సుదీర్ఘ కాలంగా డీఈవోగా పనిచేసిన పాణినితో పాటు జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ యాదవ్ ఉపాధ్యాయుడి వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడడం విద్యాశాఖ గాడి తప్పిందనేందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. 2024 లోనే డీఈవో పాణినికి తెలంగాణ మాడల్ స్కూల్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించినప్పటికీ బదిలీపై వెళ్లకుండా ఇక్కడే తిష్ట వేయడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలో ఏడాది కాలంగా జిల్లా విద్యాశాఖాధికారిపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేయడం.. చివరికి డీఈవో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి జైలుకు వెళ్లడం జరిగింది. అయితే పూర్తి స్థాయి విచారణ జరిపితే మరిన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

*- ములుగు, జూన్ 18(నమస్తే తెలంగాణ)*

డీఈవోను పట్టుకోవడంతో జిల్లావ్యాప్తంగా ఏసీబీ అధికారులపై ప్రశంసల వర్షం కురిసింది. 10వ తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో సైతం భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తున్నది. ఏజెంట్ల ద్వారా ప్రతి పనికి వసూళ్లు చేయడంతో పాటు విద్యాశాఖ కోఆర్డినేటర్ నియామకం, ఉపాధ్యాయ, సిబ్బంది నియామకాలు, సీఆర్పీల వేతనాలు, డిప్యుటేషన్ల పేరిట భారీగా వసూళ్లు, పరస్పర బదిలీల్లో సహకరించినందుకు తీసుకున్న ముడుపులపై పూర్తిస్థాయి విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడనున్నాయి.

### నెగ్గిన ఉపాధ్యాయ సంఘాల పంతం

2024 సెప్టెంబర్‌లో డీఈవో పరీక్షల నిర్వహణతో పాటు అక్రమ డిప్యుటేషన్లు, ముడుపులు చెల్లించిన వారికి విద్యా శాఖలో కోఆర్డినేటర్ల పోస్టులు కేటాయిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించినప్పటికీ కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘం నేతలు మంత్రి సీతక్కను కలిసి విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలను వివరించి డీఈవోను బదిలీ చేయాలని ఫిర్యాదు చేశారు. మంత్రి సూచనతో కలెక్టర్ డీఈవోతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులను సమావేశపరిచి రాజీ కుదిర్చారు. అయితే డీఈవోను బదిలీ చేయకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు లోలోన రగిలిపోయారు. గత మూడు నెలలుగా డీఈవోను ఏసీబీకి పట్టించే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. మొత్తానికి డీఈవోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీకి పట్టించడంతో వారు అనుకున్నది సాధించారని కొందరు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

### సర్కారు విద్యపై సన్నగిల్లుతున్న నమ్మకం

కొంత కాలంగా విద్యాశాఖలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రజలకు సర్కారు విద్య పై నమ్మకం



ములుగు డీఈవో కార్యాలయం

సన్నగిల్లుతున్నది. ములుగు జిల్లాలో అత్యంత తక్కువ శాతం విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తుండగా, గత నాలుగేళ్లుగా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 1 నుంచి 5వ స్థానంలో నిలుస్తున్నది. ర్యాంకును నిలుపుకునేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలలు, పరీక్ష కేంద్రాల నిర్వాహకులతో కలిసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తున్నది. ఇందుకు ఉదాహరణగా 2024లో ఇంగ్లిష్ పేపర్ ఓ ప్రైవేట్ స్కూల్ నుంచి లీక్ అయినట్లు సమాచారం అందించిన విద్యార్థి సంఘ నాయకుడిపైనే కేసు నమోదు చేయించారు. కొందరు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌ను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించిన పోలీస్ అధికారులపై విద్యాశాఖ అధికారులు ఎదురు తిరిగి సెంటర్ లోపల జరిగే విషయాలకు వారికి సంబంధం లేదని వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం డీఈవోను ఏసీబీకి పట్టించిన ఉపాధ్యాయుడు 317కింద గతేడాది కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలి వద్ద రూ.12లక్షలు తీసుకొని పరస్పర అంగీకారంతో వరంగల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిసింది. విధుల్లో చేరినప్పటి నుంచి పాఠశాలకు సక్రమంగా హాజరు కాకపోవడంతో గ్రామస్తులు ఎంఈవోకు ఫిర్యాదు చేయగా ఆయన సదరు ఉపాధ్యాయుడిని డీఈవో కార్యాలయానికి సరెండర్ చేసినట్లు సమాచారం. అనారోగ్యం పేరుతో సిక్ లీవ్ తీసుకున్నానని, అనంతరం పోస్టింగ్ ఇవ్వమంటే డీఈవో లంచం డిమాండ్ చేశాడని ఏసీబీ అధికారులను ఆశ్రయించి డీఈవోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను పట్టించినట్లు తెలిసింది.

### డీఈవోగా వాసంతి నియామకం



ములుగురూరల్, జూన్ 18 : జిల్లా విద్యాశాఖ అధికారిగా డీ వాసంతిని నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఈ నవీన్‌నికోలస్ ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు ఇన్‌చార్జి డీఈవో గా గతంలో పనిచేసిన జీ పాణిని లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. కాగా, అవినీతికి పాల్పడిన ఆయనను నవీన్ నికోలస్ అదే రోజు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, హనుమకొండ డీఈవోగా పనిచేస్తున్న వాసంతిని ములుగు డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. వాసంతికి గతంలో ములుగులో డీఈవోగా పనిచేసిన అనుభవం ఉంది. కాగా, ఆమె విధుల్లో ఏ రోజు చేరుతారనేది ఇంకా తెలియరాలేదు.

## మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

**అలీప్ ప్రాజెక్టు హబ్ మేనేజర్ దుహిత**



శిక్షణలో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ దుహిత

ఏటూరునాగారం, జూన్ 18 : గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అలీప్ ప్రాజెక్టు హబ్ మేనేజర్ దుహిత కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు చిరు వ్యాపారాలు, పారిశ్రామిక రంగాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ బ్యాంకు నిధులతో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా డీఆర్‌డీఏ, సెర్ప్ సంయుక్తంగా అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుహిత మాట్లాడుతూ ఔత్సాహిక మహిళలు పరిశ్రమలు, వ్యాపారం ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారికి 15రోజులపాటు వ్యాపారంలో మెళకువలు, పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిశ్రమల రంగంలో సుస్థిరత సాధించి పోటీ రంగంలో నిలదొక్కుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. డీఆర్‌డీపీ డీపీఎం గోవింద్‌చౌహాన్, పీఆర్‌ఆర్ చారిటీ ట్రస్టు వ్యవస్థాపకులు మాడుగూరి నాగేశ్వర్‌రావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మేడారం హుండీ ఆదాయం రూ.36లక్షలు

తాడ్వాయి, జూన్ 18 : మేడారం సమ్మక్క,సారలమ్మల హుండీ ఆదాయం రూ.36, 49,368లు లభించింది. గత రెండు నెలల క్రితం అమ్మవార్ల గద్దెలపై ఏర్పాటు చేసిన హుండీలు భక్తులు వేసిన కానుకలతో నిండడంతో మేడారం జాతర కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, అమ్మవార్ల పూజారులు, రెవెన్యూ, పోలీసు శాఖల సమక్షంలో బుధవారం హుండీలను తెరిచి కానుకలను భజన మండలి సిబ్బందితో లెక్కించారు. సమ్మక్క హుండీల ద్వారా రూ.18,36,233లు, సారలమ్మల హుండీల ద్వారా రూ.16,59,383లు, పగిడిద్ద రాజు హుండీలలో రూ.72,289లు, గోవిందరాజు హుండీలలో రూ.81,463లు మొత్తం రూ.36,49,368ల ఆదాయం లభించింది. ఈ మొత్తాన్ని మండలకేంద్రంలోని కెనరా బ్యాంకులో డిపాజిట్ చేశారు.

## శిక్షణ కోసం ట్రైనింగ్ సంస్థల నుంచి దరఖాస్తులు

ఏటూరునాగారం, జూన్ 18 : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ పాసైన గిరిజన అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపిక కోసం గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్‌సీ, ఇతర ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చే శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు అపారమైన అనుభవం కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సంస్థలు కనీసం ఐదేళ్లపాటు కోర్సుల్లో ట్రైనింగ్ ఇచ్చిన అనుభవం కలిగి ఉండాలని, గతంలో ఇచ్చిన శిక్షణలో మంచి ఫలితాలు సాధించి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసిన అనుభవం కూడా అవసరం అన్నారు. హనుమకొండలోని స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి కలిగి ఉండాలని కోరారు. ఆసక్తి గల శిక్షణ సంస్థలు ఈనెల 24వ తేదీలోగా తమ కొటేషన్లను హనుమకొండలోని స్టడీ సర్కిల్‌లో అందజేయాలని సూచించారు. వివరాలకు 9849736850ను సంప్రదించాలన్నారు.

## ఇండ్ల స్థలాలు ఇవ్వకుంటే పోరాటం తప్పదు

ఏటూరునాగారం, జూన్ 18 : ఆదివాసీలకు ఇంటి స్థలాలు ఇవ్వకుంటే పోరాటం తప్పదని, ఆదివాసీల గుడిసెలపై డోజర్లు, జేసీబీలతో దాడులు చేయడం తగదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ హెచ్చరించారు. మండలంలోని రొయ్యూరు సమీపంలో అటవీశాఖ అధికారులు ఆదివాసీల గుడిసెలను కూల్చివేయడంపై అరుణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుడుందెబ్బ నాయకులు గుడిసెల ప్రదేశాన్ని పరిశీలించి సంఘం జెండావిష్కరించి బాధితులతో మాట్లాడారు. 60ఎకరాల్లో 230మందికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పొడెం బాబు, కొర్నిబెల్లి గణేశ్, లక్ష్మణ్‌రావు, కోటేశ్వర్‌రావు, దబ్బగట్ల శ్రీకాంత్, సిద్ధబోయిన కార్తీక్, కొమురం రవి, తాటి నాగరాజు, ఆలం అశోక్, కురుసం వెంకన్న పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

గణపురం/కాటారం/చిట్యాల, జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న మండల స్థాయి ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. గణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కాటారం జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో, చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎంఈవోలు ఊరుగొండ ఉప్పలయ్య, శ్రీదేవి, కోడెపాక రఘుపతి తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని వారు తెలిపారు.

## డయేరియాపై అవగాహన కల్పించాలి

ఏటూరునాగారం,జూన్ 18 : గ్రామాల్లో ఈనెల 30వరకు డయేరియాపై అవగాహన కల్పించాలని సీడీపీవో ప్రేమలత కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఐటీడీఏ సహకారంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియాపై అవగాహన కల్పించాలని, ఐదేళ్లలోపు పిల్లలు డయేరియా బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగాలి

ఏటూరునాగారం/వెంకటాపూర్/వెంకటాపురం(నూగూరు)/గోవిందరావుపేట , జూన్ 18 : తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని స్థానిక సీఐ శ్రీనివాస్ కోరారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అభయమిత్ర కమ్యూనిటీ కనెక్టింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, ఎంఈవో మల్లయ్య పాల్గొన్నారు. వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో అభయమిత్ర కార్యక్రమంపై ఎస్సై చల్ల రాజు పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెంకటాపురం(నూగూరు) మండలకేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో కమ్యూనిటీ కనెక్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, ట్రైని ఎస్సై, గ్రామస్తులు పాల్గొన్నారు. గోవిందరావుపేట బైక్ మీద ప్రయాణించే వారు హెల్మెట్ ధరించకుంటే జరిమానా విధించనున్నట్లు పస్రా ఎస్సై కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## గణప సముద్రం సరస్సు నుంచి సాగునీరు విడుదల

గణపురం, జూన్ 18 : రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని గణప సముద్రం సరస్సు నుంచి వానకాలం పంటలకు ఇరిగేషన్ అధికారులతో కలిసి సాగు నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ముందస్తుగా సాగుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఈఈ బసవ ప్రసాద్ గౌడ్, ఏఈ సమ్మారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్‌యాదవ్, నాయకులు మోటపోతుల శివశంకర్‌గౌడ్, విడిదినేని అశోక్, సిరిగినేని బాబూరావు, కాల్వ రామ్‌రెడ్డి, దూడపాక శంకర్, మామిండ్ల మల్లికార్జున్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

## రైతు భరోసా రూ.72.30 కోట్లు జమ

భూపాలపల్లి రూరల్, జూన్ 18 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 90,837మంది రైతులకు రూ.72,30,42,624లను ప్రభుత్వం రైతు భరోసా కింద బుధవారం జమచేసినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పాత రైతులతోపాటు కొత్త రైతులకు కూడా రైతు భరోసా ఎలాంటి పరిమితులు విధించకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి రైతు భరోసా అందజేస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 282 గ్రామాల నుంచి 1,24,397 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులుగా గుర్తించామని, ఇందుకోసం రూ.143,99, 06,145ల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోగా, అందులో రూ.114, 50,67,074లు ఖజానా ద్వారా పంపిణీకి సంబంధించి నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 90,837 మంది రైతులకు రూ.72,30, 42,624ల నిధులు విజయవంతంగా జమ అయినట్లు తెలిపారు.

## 2025లోనే జనగణన, కులగణన జరుపాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

కృష్ణ కాలనీ, జూన్ 18 : దేశంలో జన గణన, కులగణన 2025లోనే జరపాలనీ, మేమెంతో మాకంత నినాదంతో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి సమైక్యంగా పోరాడాలనీ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బీసీ కుల హక్కుల సాధన సమితి సమీక్ష సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ బీసీ సంఘాలు నిర్వహించిన పోరాటాల ఫలితంగానే కేంద్రప్రభుత్వం దేశ జనగణనలో కులగణనకు ఆమోదించి గెజిట్ ప్రకటన చేసిందన్నారు. 2025 లోనే జనగణన పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలనీ డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు కుమారస్వామి, భీమనాథుని సత్యనారాయణ, క్యాతరాజు సతీశ్, మెరుగు రమేశ్, మేడి శేఖర్, రమేశ్‌చారి, భద్రయ్య, గోలి లావణ్య, సంధ్య, భారతి, యాకూబీ, భద్రమ్మ పాల్గొన్నారు.

## స్వర్ణభారతి మండల సమాఖ్య రజతోత్సవ వేడుకలు

గణపురం, జూన్ 18 : మండల కేంద్రంలోని స్వర్ణభారతి మండల సమాఖ్య ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి కావడంతో బుధవారం రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య కార్యాలయ ఆవరణలో ఏపీఎం ఇమామ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఆర్డీఏ పీడీ బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు తమ అనుభవాలను, అభివృద్ధిని వివరించారు. డీఆర్డీఏ పీడీ బాలకృష్ణ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం స్వర్ణభారతి మండల సమాఖ్య వ్యవస్థాపక పాలకవర్గం అధ్యక్షురాలు చెలుమల్ల సంధ్యారాణి, కార్యదర్శి ఎండీ రజియా, కోశాధికారి సంపెల్లి సరస్వతిలను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించా రు. కార్యక్రమంలో డీపీఎం సోమయ్య, ఏపీఎం ఇమామ్, సీసీ బాబా, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు, సీఏలు, వీవోఏలు పాల్గొన్నారు.

## కేటీకే ఓసీ-2లో బొగ్గు ఉత్పత్తి, రవాణాకు విఘాతం

**వర్క్ మెన్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో పనులు నిలిపివేత**

కృష్ణ కాలనీ, జూన్ 18 : కేటీకే ఓసీ -2 గనిలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం 11 గంటల వరకు బొగ్గు ఉత్పత్తి రవాణాకు విఘాతం కలిగింది. కేటీకే ఓసీ–2 గనిలో ఎస్వీఈసీ ఓబీఆర్ సంస్థ కాంట్రాక్ట్ పద్ధతుల నిర్వహిస్తున్న వర్క్ మేన్లకు వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో 500మంది వర్క్ మెన్లు, గణపురం మండలంలోని కేటీకేఓసీ–3లో సైతం 600మంది వర్క్ మెన్లు మంగళవారం విధులకు హాజరు కాలేదు. దీంతో ఓసీ–2లో ఉత్పత్తి అయిన బొగ్గు రవాణా జరుగలేదు. సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి ప్రకారం బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. బుధవారం ఉదయం ఏడు గంటలకు మొదటి షిఫ్ట్ ప్రారంభం కాగా 11 గంటల వరకు సైతం బొగ్గు రవాణా జరగలేదు. దీంతో ఎస్వీఈసీ ఓబీఆర్ సంస్థ వర్క్ మేన్లతో చర్చలు జరుపగా ఉదయం 11గంటల నుంచి యథావిధిగా బొగ్గు రవాణా జరిగింది. ఈ విషయమై సింగరేణి భూపాల్‌పల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏ రాజేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగలేదని, సంస్థకు సైతం ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు.

## అందాల పోటీలకున్న ప్రాముఖ్యత ఆరుగురి ప్రాణాలకు లేదా?

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్**



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పుట్ట మధు

మహదేవపూర్, జూన్ 18 : హైదరాబాద్‌లో జరిగిన అందాల పోటీలకు మంథని ఎమ్మెల్యే ఇచ్చిన ప్రాముఖ్యత మేడిగడ్డ బరాజ్‌లో ఈతకు వెళ్లి మృతి చెందిన ఆరుగురు యువకుల ప్రాణాలకు ఇవ్వలేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం ఆయన అంబట్‌పల్లి గ్రామానికి చెందిన పట్టి మధుసూదన్, పట్టి శివమనోజ్, తొగరి రక్షిత్, కర్నాల సాగర్ దశ దిన కర్మకు హాజరై బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బరాజ్‌లో యువకుల ఆచూకీ కోసం గాలింపు చేపడితే మంథని ఎమ్మెల్యే హైదరాబాద్‌లో అందాల పోటీల్లో పాల్గొన్నారని ఆరోపించారు. రెండు రోజుల తర్వాత బాధితుల ఇండ్లకు వచ్చి పరామర్శించి రూ.లక్ష ఎక్స్ గ్రేషియా ఇప్పిస్తామని చెప్పి వెళ్లాడని, కానీ, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదన్నారు. మృతుల కుటుంబాలకు కేవలం రూ.లక్ష ఎక్స్ గ్రేషియా ప్రకటించారని, ఇతర రాష్ట్రాల్లో రూ.కోటి ఇస్తున్నారని గుర్తు చేశారు. మంత్రి హోదాలో ఉండి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతైనా ఇప్పించవచ్చు కదా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఉద్యమకారులు చనిపోతే ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున సాయం అందించినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలను ఆయన కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాడనే విషయం అర్థమవుతున్నదన్నారు. ప్రభుత్వం అందించే రూ.లక్ష ఎక్స్ గ్రేషియాను మృతుల కుటుంబాలు తిరస్కరించాలని, మూడేండ్లలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలో వస్తుందని, వెంటనే ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున సాయం అందిస్తామన్నారు.

ప్రభుత్వం నుంచి రాకపోతే సొంతంగా అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎల్కేశ్వరం గ్రామంలో ఇటీవల ప్రభుత్వ దవఖానలో వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన రాళ్లబండి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, సీనియర్ నాయకుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో పోలీసుల ఓవరాక్షన్

**రిపోర్టర్లను అనుమతించని వైనం**

కన్నాయిగూడెం, జూన్ 18 : మండలంలోని బుట్టాయిగూడెంలో బుధవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సు పోలీసుల పహారాలో జరిగింది. రైతులనుంచి నేరుగా రెవెన్యూ అధికారులకు ఇవ్వాల్సిన దరఖాస్తులను పోలీసులు తీసుకుంటూ గేటు దగ్గరనే అందరినీ ఆపుతూ ఓవరాక్షన్ చేశారు. రైతులతో నేరుగా రెవెన్యూ అధికారులు మాట్లాడాల్సి ఉండగా పోలీసులు దరఖాస్తులు తీసుకుని అధికారులతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులను మండుటెండలో నిలబెట్టడంతో చేసేదేమీ లేక పక్కన ఉన్న చెట్లకిందకు పోయి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వచ్చిన రిపోర్టర్లను లోపలకు అనుమతించకుండా పోలీసులు గేటు దగ్గర ఆపి దురుసుగా ప్రవర్తించారు. ప్రముఖ పత్రికలో పనిచేస్తున్న ఓ రిపోర్టర్ సెల్‌ఫోన్ తీసుకున్న కానిస్టేబుల్ 15నిమిషాల తర్వాత ఇచ్చారు. రైతులను ఎండలో నిలబెట్టడం, రిపోర్టర్లను అడ్డుకొని వెళ్లగొట్టడం చూస్తుంటే ప్రభుత్వం కావాలనే ఈ విధంగా ఇబ్బందులు పెడుతున్నట్లు ఉందని వాపోయారు. తీసుకున్న దరఖాస్తులు రెవెన్యూ అధికారుల దగ్గరకు పోతాయా..? పోలీసులే పట్టుకొని పోతారా..? అంటూ సెటైర్స్ వేసుకుంటున్నారు.

## ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ములుగురూరల్, జూన్ 18 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి సమీక్షించారు. మొదటి విడుతలో చేపట్టిన ఇండ్ల పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పనుల పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణాను నిర్మూలించేందుకు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఏఈలు టోకెన్‌ల జారీ చేపట్టాలని అన్నారు. సమీక్షలో మండల ప్రత్యేక అధికారులు ఏపీఎంలు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

ఏటూరునాగారం, జూన్ 18 : మండలంలోని ముల్లకట్ట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సోయం పాపారావు భార్య కాంత ఇటీవల ప్రమాదానికి గురై బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కాంత మృతదేహం వద్ద నివాళులర్పించారు. పాపారావును పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, వలీబాబా, తాడూరి రఘు, కాకులమర్రి భాస్కర్‌రావు, పర్వతాల ఎల్లయ్య, మెరుగు వెంకటేశ్వర్లు, ఎర్రల సారయ్య, దేపాక శ్రీరాం, వావిలాల కిశోర్, కట్కూరి రాకీ, రత్నం నర్సింహారావు, బీ శేఖర్ పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లంపల్లి, జూన్ 18 : గ్రామాల వారీగా వైద్య సిబ్బంది నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. రామచంద్రాపురం పల్లె దవాఖానలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రణధీర్, డెమో సంపత్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## రెవెన్యూ సదస్సును పరిశీలించిన అదనపు కలెక్టర్

మహదేవపూర్ (కాళేశ్వరం), జూన్ 18 : మండల పరిధిలోని కుంట్లం గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేయని రైతులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కుంట్లంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 125దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రామారావు తెలిపారు. డీటీ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యానపంటల పథకాలపై అవగాహన ఉండాలి

చిట్యాల, జూన్ 18 : ఉద్యానవన పంటల పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సునీల్ అన్నారు. బుధవారం మండలంలోని జూకల్ రైతు వేదికలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా అందుతున్న వివిధ రకాల ఉద్యానవన పథకాలు, వాటి అర్హత ప్రమాణాలు, రాయితీ శాతాలు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, కొత్త పండ్ల తోటలు, కొత్త కూరగాయల పందిరి, ఉద్యాన యాంత్రీకరణ, ఆయిల్‌పామ్ సాగు, డ్రిప్, స్ప్రింకర్ల వంటి ప్రాధాన్యత ప్రయోజనాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో దీపక్, ఓరుగల్లు ఎఫ్‌పీవో డైరెక్టర్లు సమ్మిరెడ్డి, నరసయ్య, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రయ్య

కృష్ణ కాలనీ, జూన్ 18 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం హోరాహోరీగా జరిగిన ది కాకతీయఖని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసింపల్లికి చెందిన మేకల చంద్రయ్య 146 ఓట్ల భారీ మెజార్టీతో కంకణాల రవీందర్‌రెడ్డిపై గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఏనగంటి రమేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అన్వర్‌పాషా, జాయింట్ సెక్రటరీగా రాసమల్ల లింగమూర్తి, కోశాధికారిగా చిత్తారి రాకేశ్ గెలుపొందారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు నూనె సుధాకర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన డీఎస్పీ

కాటారం, జూన్ 18 : మండలకేంద్రంలో బుధవారం రాత్రి కాటారం డీఎస్పీ సూర్యనారాయణ వాహన తనిఖీ చేపట్టారు. ఎస్సైలు శ్రీనివాస్, ఓంపాల్‌లతోపాటు సిబ్బందితో కలిసి డీఎస్పీ వాహనాలను తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. అనుమానితులను విచారించి వదిలేశారు.

## బియ్యం లారీ పట్టివేత..??

చిట్యాల, జూన్ 18 : మండలంలోని జడలపేట గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లు వద్ద లారీలో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నట్లు తెలిసింది. సుమారు 265క్వింటాళ్ల బియ్యంతో కూడిన లారీని చిట్యాల స్థానిక పోలీస్‌స్టేషన్‌కి తరలించి పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యం మిల్లులో అమ్మకానికి పెడుతున్నట్లు తెలియడంతో టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిసింది.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

తాడ్వాయి, జూన్ 18 : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలీసుల విధులు, కేసులు పరిష్కరించే విధానాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగం, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, రోడ్ సేఫ్టీ, సెల్‌ఫోన్ వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా వాటర్ బాటిళ్లు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమ దత్తతపై చట్టపరమైన చర్యలు

ఏటూరునాగారం, జూన్ 18 : అక్రమంగా దత్తత తీసుకునే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీవో ప్రేమలత హెచ్చరించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా బాలల విభాగం ఆధ్వర్యంలో అక్రమ దత్తతపై బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. సీడీపీవో ప్రేమలత మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తత ఎంతో సంతోషకరమని, అక్రమ దత్తత ఏనాటికైనా ఆందోళన కరమన్నారు. జిల్లా బాలల ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ శిశువులను అమ్మినా, కొన్నా చట్టరీత్యా నేరమన్నారు. ఒక వేళ దత్తత తీసుకుంటే అందుకు తగిన ప్రక్రియ ఎలా ఉంటుందో వివరించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ సుమలత, స్వప్న, సూపర్‌వైజర్లు శ్రీ విద్య, పుష్పవతి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**CHANGE OF NAME**

I, SAMALA RAMADEVI W/o RAMESH R/o. H.No: 4-17, Kothaguda village of Kothaguda Mandal, Mahabubabad District-506 135, TG. I have changed my name from RAMADEVI SHAMALA W/o RAMESH to SAMALA RAMADEVI W/o RAMESH for all future purposes.

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

**CHANGE OF NAME**

I, RAJIREDDY PATHURI S/o VENKAT REDDY R/o. H.No: 5-100/ 11 Vill & Mdl: NARMETTA, Dist: JANGAON, TG. I have changed my name from RAJU PATHURI S/o VENKANNA to RAJIREDDY PATHURI S/o VENKAT REDDY for all future purposes.

**BUSINESS OFFER**

★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565